క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో బోనాల సంబురాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న విద్యార్థిని విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: ఆషాఢ మాసం పురస్కరించుకొని మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు మంగళవారం బోనాల పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీలు బోనాలు ఎత్తుకోగా, విద్యార్థులు పోతరాజుల వేషధారణతో ఊరేగింపుగా తుంకి నల్ల పోచమ్మ ఆలయానికి వెళ్లి సమర్పించారు. ఆషాఢ మాసంలో బోనాల ప్రత్యేకతను విద్యార్థులకు తెలియపరచడంతో పాటు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే విధంగా ప్రతి ఏటా పాఠశాలలో బోనాల పండుగ సంబరాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫర్హాన్ తెలిపారు.

బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలి

ఎస్టీయూ అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్



మాట్లాడుతున్న రాజగోపాల్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయులకు బదిలీలతో పాటు, పదోన్నతులు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన చిలప్‌చెడ్ మండలంలో గల పాఠశాల ఉపాధ్యాయులకు ఎస్టీయూ సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లకుండా పదోన్నతులు ఇవ్వాలన్నారు. టీజీజేఏసీతో కుదిరిన ఒప్పందం మేరకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సుభాష్, మండల అధ్యక్షుడు వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్, కోశాధికారి నవీన్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య స్నేహితుల ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న బాల్య స్నేహితులు

శివ్వంపేట(నర్సాపూర్): ఆపదలో ఉన్న స్నేహితుడికి బాల్య స్నేహితులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధి పిల్లుట్ల గ్రామానికి చెందిన గోనయ్య విద్యుత్ స్తంభంపై నుంచి పడి వెన్నుముక దెబ్బ తినడంతో కదలలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న 2000–01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు గోనయ్యను పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు. మరో తోటి విద్యార్థి స్వామి కొడుకు కాలు ఫ్రాక్చర్ కావడంతో అతనికి సైతం ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న బాల్య స్నేహితులను ఆదుకోవడానికి తమ వంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి చేయాలి



చెక్కు అందుకుంటున్న చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి రూ.3.16లక్షల చెక్కును అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ ఆడిటోరియంలో ప్రాథమిక సహకార సంఘాల బలోపేతంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీల్లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు తక్కువ ధరకు అందుబాటులో ఉండే విధంగా చైర్మన్లు, సిబ్బంది కృషి చేయాలని సీఎం సూచించినట్లు చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి తెలిపారు.

నేడు మెదక్‌లో నీటి సరఫరా బంద్

మెదక్ మున్సిపాలిటీ: మిషన్ భగీరథ పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం మెదక్ పట్టణంలో నీటి సరఫరా జరగదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు చోట్ల పైప్‌లైన్ సమస్యలు ఏర్పడ్డాయని, వాటిని మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పోషకాహార లోపంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి
- రెడ్డిపల్లి, చిన్నచింతకుంట అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

నర్సాపూర్ రూరల్: పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని చిన్నచింతకుంట, రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 0 నుంచి 5 సంవత్సరాల పిల్లల ఆరోగ్యం, బరువును స్వయంగా కొలతలు తీయించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు పిల్లలను ప్రీ స్కూల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు వయస్సు తగ్గ బరువు, ఎత్తుకు బరువు ఉన్నారా లేదా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు కొలతలు చేసి నిర్ధారించాలని సూచించారు. పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి మంచి ఆహారం అందేలా చూడాలన్నారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు ఉచితంగా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లలతోపాటు గర్భిణి, బాలింత మహిళలు అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే ఆహారాన్ని తీసుకునే విధంగా చూడాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల ఆవరణలో న్యూట్రి గార్డెన్ ఉండేలా చూసుకొని రసాయన ఎరువుల వాడకుండా ఆకుకూరలు, కాయగూరలను పండించి పిల్లలు, బాలింత, గర్భిణిలకు అందిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. అంగన్‌వాడీ రికార్డులతో పాటు ఆన్‌లైన్‌లో పౌష్టికాహారం తీసుకునే లబ్ధిదారుల పేర్లను నమోదు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో నర్సాపూర్ సీడీపీవో హేమభార్గవి, సూపర్‌వైజర్లు ఉన్నారు.



చిన్నచింతకుంటలో తనిఖీ చేస్తున్న హైమావతి

చెత్తను కాల్చేస్తున్నారు...

చిన్నశంకరంపేట(మెదక్): పర్యావరణ సంరక్షణకు కృషి చేయాల్సిన పంచాయతీ సిబ్బంది చెత్తను కాల్చేస్తున్న సంఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నార్సింగి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఇంటింటికి తిరిగి సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు తరలించాల్సి ఉంటుంది. కానీ డంప్‌యార్డుకు చెత్తను తరలించకుండా మిర్జాపల్లి రోడ్డు పక్కన ఉన్న పాడుబడిన బావిలో చెత్తను వేస్తున్నారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను పంచాయతీ సిబ్బంది కాల్చివేస్తున్నారు. దీంతో చెత్తకు నిప్పంటుకుని పొగచూరుతుంది. దీంతో రహదారిపై వెళుతున్న వాహనదారులకు పొగచూరడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చెత్తను డంప్‌యార్డులోనే వేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం

ఎంపీపీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో స్వచ్ఛత కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించి పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



అనుమతులు లేని నిర్మాణాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని మిలట్రీ కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని మంగళవారం మున్సిపల్ అధికారులు కూల్చి వేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న అన్ని నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. ప్రభుత్వ అనుమతు లు లేకుండా ఎవరూ అక్రమంగా నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. అలాంటి వాటిపై చర్యలు ఉంటాయన్నారు.

చెక్కుల పంపిణీ



పర్కిబండలో చెక్కులను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండకు చెందిన ఇద్దరికి ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకులు మంచ శ్రీరాం తెలిపారు. మంగళవారం లబ్ధిదారులైన కుమ్మరి చరణ్‌కు రూ.23,500, గాయంతి ఎల్లంకు రూ.60వేల విలువైన చెక్కులను అందజేశారు. వీరి వెంట నర్సింలు యాదవ్, ఆంజనేయులు, లక్ష్మణ్, రమేష్, రాములు, కుమార్, మహేష్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు రూ.4.50లక్షల చెక్కులను కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నవీన్, మాజీ సర్పంచ్ భాస్కర్, జగన్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ పరమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కురిసిన వర్షం.. మురిసిన రైతన్న



రేగోడ్: కురుస్తున్న వర్షం

రేగోడ్(మెదక్): ఎట్టకేలకు వర్షం కురిసింది. సీజన్‌కు ముందు వర్షం కురిసి మురిపించింది. తర్వాత ముఖం చాటేసింది. విత్తనాలు విత్తిన రైతులు నిత్యం ఆకాశం వైపు చూడసాగారు. కళ్ల ముందే పాడవుతున్న పంటలను చూసి దిగాలు చెందుతున్న తరుణంలో.. వరుణుడు కరుణించి కొంత ఊరట నిచ్చాడు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పడిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇంకా బాగా పడి చెరువులు, కుంటలు నిండాలని వారు కోరుకుంటున్నారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం



వట్‌పల్లి(అందోల్): సభ్యత్వాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

వట్‌పల్లి(అందోల్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఆ శాఖ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని వట్‌పల్లి, పోతుల బోడుగా, మంచిర్యాలతండా, మేడికుందా తదితర పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఏర్పడిన సంఘం పీఆర్టీయూ అని అన్నారు. ఎన్నో సౌకర్యాలు జీఓల రూపంలో ఇప్పించడంలో సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దేశ్వర్, జిల్లా బాధ్యులు శ్రీనివాస్, రవీందర్, మురళీధర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి

మునిపల్లి(అందోల్): పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి ఒకే విడతలో బకాయిలను చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అకుల ప్రభు సంబంధిత అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని మునిపల్లి మోడల్ స్కూల్, మల్లిఖార్జునపల్లి, మునిపల్లి పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులకు అందాల్సిన ప్రయోజనాలు, మేడికల్ బిల్లు , అర్జిత సెలవుల నగదు, జీపీఎస్ నగదును వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధానకార్యదర్శి సురేందర్, నాయకులు ఉమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పచ్చదనాన్ని కాపాడుదాం

అటవీ శాఖ రేంజ్ అధికారి అరవింద్

నర్సాపూర్ రూరల్: మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడుదామని నర్సాపూర్ అటవీ శాఖ రేంజ్ అధికారి అరవింద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్, లైఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తమ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. అమ్మ పేరు మీద ఒక మొక్క సైతం నాటాలన్నారు. వన్య సంపద క్రమంగా తరిగిపోతున్న తరుణంలో యువత తమ వంతు బాధ్యతగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చరణ్ రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అదెప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జిలు సురేష్ కుమార్, శ్రీనివాస్, అధ్యాపకులు రమేష్, రవి, ఆరిఫ్, హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అధికారులు విద్యార్థులు

ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలి

అకాడమీ మానిటరింగ్ అధికారి వెంకట్‌స్వామి

శివ్వంపేట(నర్సాపూర్): అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర అకాడమీ మానిటరింగ్ అధికారి వెంకట్‌స్వామి అన్నారు. మంగళవారం శివ్వంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లపై 12 పాఠశాలలకు సంబంధించి 36 మంది ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండో రోజు అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 25 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను మంజూరు చేసిందన్నారు. ఆయా పాఠశాలల్లో రూ.10 లక్షల విలువ గల రోబోటిక్స్‌తో పాటు అధునాతన ప్రయోగ పరికరాలను అందజేసిందన్నారు. సైన్స్, టెక్నాలజీ, గణితం, ఇంజనీరింగ్‌పై విద్యార్థులు పట్టు సాధించేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈఓ బుచ్చనాయక్, గెజిటెడ్ హెచ్‌ఎం కోర్స్ కో ఆర్డినేటర్ బాలచంద్రం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌స్వామి

గంజాయి, డ్రగ్స్‌కు బానిస కావొద్దు

కళాజాత బృందం అవగాహన కార్యక్రమం



చల్మెడలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

నిజాంపేట(నిజాంపేట): యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సాంస్కృతిక కళాసారథి బృందం గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. నిజాంపేట మండల పరిధిలోని చల్మెడలో మంగళవారం పాటలు రూపంలో అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాలతో పాటు, యువత చెడు మార్గం ఎంచుకోవద్దని సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల ఆవశ్యకతను ప్రజలకు పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం కోఆర్డినేటర్ శివోల్లా కృష్ణ, రామారావు, ఎల్లయ్య నరసయ్య, సిద్ధులు ఎల్లయ్య, శేఖర్, విజయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

పంట మార్పిడి దిశగా ప్రోత్సాహం

జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్

నర్సాపూర్: రైతులు పంట మార్పిడి దిశగా మారేందుకు ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ చెప్పారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో పలువురు రైతులకు జాతీయ ఆహార, పోషక భద్రత పథకం కింద మినుములు, జొన్న విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి అలవాటు చేసుకుని పంటలు మారుస్తూ సాగు చేయాలని కోరారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం రైతులకు జాతీయ ఆహార, పోషక భద్రత పథకం అమలు చేస్తుందన్నారు. ప్రత్యామ్నాయ పంటలు పప్పు దినుసులు, చిరుధాన్యాలు సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దీపిక, ఏఈఓలు మోహన్, తేజస్విని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విత్తనాల కిట్లు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, అధికారులు

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

ఆర్మీ సుబేదార్ బిక్రం సింగ్

పాపన్నపేట(మెదక్): ఎన్‌సీసీ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తుందని ఆర్మీ సుబేదార్ బిక్రం సింగ్ పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడుతూ.. ఎన్‌సీసీ చిన్నప్పటి నుండి క్రమశిక్షణ నేర్పుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరు ఎన్‌సీసీలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 47 మంది ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, రియాజ్, రమేష్, అంజాగౌడ్ ఉన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లతో సుబేదార్ బిక్రంసింగ్

ఘనంగా శ్రీరేణక ఎల్లమ్మదేవి కల్యాణం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మదేవి ఆలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఒగ్గుపూజారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దేవతామూర్తులకు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మదేవి కల్యాణం ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రం కృష్ణాగౌడ్, రాష్ట్ర కార్యదర్శి దుర్గాగౌడ్, నాయకులు సత్యనారాయణగౌడ్, పుండరీకంగౌడ్, మనోహర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, రమేష్‌గౌడ్, దశరథ్‌గౌడ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే ఇవ్వాలి

చేగుంట(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే ఇవ్వాలని మక్కరాజీపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలో 29 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు అధికారులు ప్రకటించి అర్హుల జాబితాను బహిర్గతం చేయలేదన్నారు. ఎంపీడీఓ కార్యాలయంతో పాటు పంచాయతీ కార్యదర్శిని లబ్ధిదారుల జాబితా అడగడంతో వారు స్పందించడం లేదన్నారు. లేదు. దీంతో అనర్హులకే ఇళ్లను మంజూరు చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లబ్ధిదారుల జాబితా ప్రకటించాలని, లేదంటే ఎంపీడీఓ కార్యలయం వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

• సమస్యలు పరిష్కరించాలని వినతి

నర్సాపూర్: నర్సాపూర్ పట్టణం మూడో వార్డులోని ఎన్జీవోస్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు ఆనంద్‌కుమార్, హైమద్ మంగవారం మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందచేశారు. మంచినీటి సమస్య ఉందని, అన్ని ప్రాంతాలకు నీరు సరిగా రావడం లేదని, మురికి కాలువలు, రోడ్లు సరిగా లేవని వారు తెలిపారు. కోతులు, కుక్కల బెడదతో మహిళలు, చిన్న పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, దోమల బెడద ఉందని వారు వివరించారు. కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి స్పందిస్తూ.. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

• ఈజీఎస్ పనులపై గ్రామసభలు

పెద్దశంకరంపేట(మెదక్): సోషల్ ఆడిట్‌లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాలలో డీఆర్పీలు ఉపాధిహామీ పనులపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం శివాయిపల్లి, బుజ్రాన్‌పల్లి తదితర గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. డీఆర్పీలు ఈజీఎస్ నిధులతో చేపట్టిన పశువుల షెడ్లు, తొట్లు, ఫిష్‌పాండ్స్, రహదారి పనులపై పూర్తి వివరాలను గ్రామసభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్ అలీ, గ్రామకార్యదర్శులు సవిత, ఈసి నవాజుద్దీన్ పాల్గొన్నారు.

• పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నిజాంపేట(మెదక్): పరిసరాల పరిశుభ్రతలో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ కార్యదర్శి చంద్రహాస్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో పారిశుద్ధ్యం పై తనిఖీలు నిర్వహించారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి ఆవరణలో కలుపు మొక్కలు లేకుండా చేయాలన్నారు. వైద్య చికిత్స నిమిత్తం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

• విజయవంతం చేయాలి

నర్సాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ పార్టీ కార్యకర్తలను కోరారు. అధ్యక్షుడి హోదాలో ఈ నెల 18న మొదటిసారి జిల్లాకు వస్తున్నారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

• బీసీ రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలి

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించినందున పక్కాగా అమలు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లు పక్కాగా అమలు చేసేందుకు చట్టం తేవాలని, రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేయాలని చూస్తే వెనుకబడిన వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతున్నారని హెచ్చరించారు. స్థానిక సంస్థలతో పాటు అన్ని రంగాలలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చంద్రాగౌడ్ కోరారు.

• ప్రభుత్వ స్థలం కేటాయించాలి

పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మోజోస్



రామాయంపేట(మెదక్): పట్టణాల్లో సమాధుల నిమిత్తం ప్రభుత్వ స్థలం కేటాయించాలని పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు న్యూటన్ మోజోస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం రామాయంపేటలోని పాస్టర్ ఆకుల చర్చిలో జిల్లాలోని పాస్టర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. త్వరలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలవనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామాల్లో ఉన్న పాస్టర్లకు త్వరలో గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి స్టీఫెన్, కోశాధికారి దేవయ్య, మండలాల సంఘాల అధ్యక్షులు ప్రభుదాస్, పద్మారావు, అకుల పాల్గొన్నారు.

• పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి దేవులతండా ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ బాలరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు.